**చైతన్యాన్ని చంపెయ్యడం నేరం, సహజ సౌందర్యాన్ని హత్యచెయ్యడం! దాన్నే కళగా, క్రమశిక్షణగాభావించడం మరెంత దారుణమో!**

నడకలో హొయలు.

మేని రంగులో నునుపు.

గళంలో మాధుర్యం.

తలుపులన్నీ బిగించబడిన, గాలి చొరని గదిలో ఒంటరిగ వుంటే, గోడకున్న పగులునుండి సన్నగ గాలితెర వచ్చి పలుకరించిన అనుభూతి-దాన్ని చూసినప్పుడు.

చాల చిన్నది, ఆ పక్షి.

నీలి రంగు రెక్కలు, తోక నలుపు, సన్నటి ముక్కు, తలమీద ఆకుపచ్చ రంగు, మెడమీద కాలర్‌లా నలుపు, ఎర్రటి కాళ్ళు. ఎక్కడిదో వచ్చి దొడ్లో జామచెట్టు మీద వాలింది. ముద్దుగ ఎగురుతుంటే- దాన్ని మచ్చిక చేసుకోవా లనిపించింది కమలకు. చాల ప్రయత్నం చేసింది.

తొలుత గింజలు వేసినా దగ్గరకు చేరలేదు. భయంగా బెరుకుగా ఎగిరిపోయేది. గింజలికి ఆశ వున్నా వాటిమీద వాలేదికాదు భయంతో. క్రమంగా భయంతీరి, తనకేం ప్రమాదం కల్గదనే నమ్మిక కల్గి గింజల మీద వాలింది. క్రమంగా దాన్ని బెడ్‌రూమ్ కిటికీ దగ్గరకు అలవాటు చేసింది.

సాయంత్రం ఎటో ఎగిరిపోయేది. మరునాడు పదింటికి మరలా కిటికీలో వాలేది. దాన్ని చూస్తూ గడిపేది కమల. మధ్యాహ్నాలు అందంగ, ఆనందంగ, స్వేచ్ఛగ ఎగిరే ఆ పిట్టను చూసినపుడు తనకు జారిపోయిన మధుర క్షణాలు హాయిగ, ఏ బంధమూ లేకుండ, సరదాగ, సంబరంగ. కొండమీద కోవెలలో, చెరువు గట్టుమీది మర్రిచెట్టునీడలో, కాలవలో బల్లకట్టుమీద, పావిడిలో లేదూడలమధ్య, తర్వాత స్కూల్లో, పిల్లలతో పాటలు పాఠాలు కలిపి-స్కూలుమానేసినతర్వాత-మేడమీద ప్రకృతి ప్రోదిచేసిన అందం మధ్య. చుట్టు పైరు పరచిన ఆకుపచ్చని తివాచీ- దూరంగ నల్లగ తోటలు, వాటి వెనుక ఈల వేసుకుంటూ పొయ్యే పొగ బండి; దాని తాలూకు దీపాల తోరణం, చెట్లమధ్య దాగుడుమూతలాడుతూ పరుగిడుతూ; ప్రక్కగ ఇళ్ళ కప్పులనుండి పొగ; గుడి గోపురంమీది నియాన్‌లైటు. తను—వీణ వాయించుకుంటూ తన్మయత్వంతో సర్వంమరచి అమ్మ వచ్చి మందలించేదాకా—

ఇప్పుడా వీణ- అటకమీద, బూజుపట్టి తీగలు తెగి—

"ఏమిటి కలలు కంటున్నావ్?"


"అబ్బే, ఏంలేదు."

కృష్ణమూర్తి తన గదిలోకి వెళ్ళాడు.

వంటింటిలోకి వెళ్ళి స్టౌ వెలిగించి, టీకి నీళ్ళు పెట్టింది కమల.

పెళ్ళయినతర్వాత ఊరు మారింది. పట్నవాసం యిప్పుడు. కృష్ణమూర్తి బ్యాంక్ ఆఫీసరు. తను మారింది. తనంతకుముందు అనుభవించిన అందమంతా, స్వేచ్ఛఅంతా కుదించుకపోయి ఇరుకు గోడలమధ్య బంధించబడింది.

టీ తీసుకున్నాడు కృష్ణమూర్తి.



"రాంబాబు, వాళ్ళావిడ కనిపించారు బజార్లో. నువ్వసలు వాళ్ళ యింటివైపు వెళ్ళడంలేదట. నిన్ను రమ్మన్నా రొకసారి—"

"మీరు లేకుండ ఒక్కదాన్నే ఏం వెళ్తాను" — కమల సమాధానం చెప్పింది.

ఆ సమాధానానికి కృష్ణమూర్తి సంతోషించాడు.

పిల్లలు స్కూలుకు, కృష్ణమూర్తి బ్యాంక్‌కు వెళ్ళిన తర్వాత కమలకు ఏమీ తోచదు. ఎక్కడికైనా వెళ్ళాలనుంటుంది; కృష్ణమూర్తి కదిగిట్టదు. అతనితోనే వెళ్ళాలి బజారుకైనా, స్నేహితుల ఇంటికైనా, సినిమాకైనా.

రాంబాబు కృష్ణమూర్తి మిత్రుడు- చాల సరదామనిషి.

కాపురంపెట్టిన కొత్తలో కృష్ణమూర్తి కోసం ఒకసారి వచ్చాడతను.

కృష్ణమూర్తి ఇంకా బ్యాంక్ నుంచి రాలేదు—

కమల బిడియపడింది. మర్యాద కోసం కూర్చోమని ఆహ్వానించి కాఫీ ఇచ్చింది. అతనేవేవో చాలా విషయాలు మాట్లాడాడు. జోకులు వేశాడు. నవ్వించాడు జంకు లేకుండా చేశాడు. కమల చాల ఫ్రీగా, హాయిగా నవ్వగలిగింది అతని మాటలకు. కృష్ణమూర్తి వచ్చిన తర్వాత కొద్దిసేపు మాట్లాడి వెళ్ళిపోయాడు రాంబాబు.

తర్వాత—

"ఏమిటతనితో ఆ పకపకలు."

"చాలా సరదాగా మాట్లాడతాడు."

"నేను లేనప్పుడు నువ్విలా ప్రవర్తించకూడదు."

"నేనేం తప్పు చేశాను. మీరే గద అతన్ని పరిచయం చేసింది. నేనాయనతో మాట్లాడిన దాకా వదలలేదా రోజు, పైగా సిగ్గు పడటం సభ్యత కాదన్నారు."

"ఆ సభ్యత నేనున్నప్పుడు మాత్రమే. నేను లేనప్పుడు ఎవర్ని రానివ్వకూడదు."


"అతను చాల ఆప్తమిత్రు డన్నారు."

"అతను స్నేహితుడు అంతే.... ఆప్తుడేం కాదు."

"మీ మనసు చాల సంకుచితం."

"నోర్ముయ్!"

కమలకింకా అప్పటికి కృష్ణమూర్తి పూర్తిగ అర్థంకాలేదు. కమలకింకా అప్పటికి మాటలు, చేతలు, మనసు— హద్దుల్లో బిగించడం అలవాటుకాలేదు.



మాట మాట పెరిగింది.

కమల చెంప పగిలింది.

పుట్టింట్లో ఒక మాట పడని, ఒక దెబ్బ తినని కమల నివ్వెరపోయింది. దుఃఖంతో పుట్టింటికి చేరింది.

చాల రోజులు కృష్ణమూర్తి కబురు చేయలేదు.

ఇష్టంలేకున్నా, బలవంతంచేసి, తండ్రి మరల తీసుకొచ్చి విడిచిపెట్టాడు.

"అమ్మా, స్త్రీకి భర్తే దైవం. మెట్టినిల్లే స్వర్గం. పుట్టినిల్లు నీకిక ఏమీకాదు. బాధైనా, భారమైనా పతితోటే జీవనం" అని నీతులు చెప్పాడు.

వెళ్ళడానికున్న ఒకేమార్గం మూయబడింది.

"ఏం వచ్చావ్- ఎవరు రమ్మన్నారు?" హేళన చేశాడు కృష్ణమూర్తి.

కమల మాటాడలేదు.

"నేను చెప్పిన మాట వినాలి. అలాగైతేనే వుండు. నీ ఇష్టం. ఇప్పుడే ఆలోచించుకో. నేను దుర్మార్గుణ్ణి కాదు. నిన్ను హింస పెట్టను. అయితే నాకంతా పద్ధతి ప్రకారం, క్రమశిక్షణగా జరగాలి- అప్పుడు నా అంత మంచి మనిషి మరొకడుండడు."

కమల తల వంచుకుంది.

గతం మేస్తున్న కమల పిల్లలు రావడంతో ప్రస్తుత స్పృహలోకి వచ్చింది. నవ్వుతూ కేరింతలు కొడుతూ వాసంతి, వాసు లోనికొచ్చి పుస్తకాల సంచులు

మూలకు విసిరేశారు. ఇంటో కృష్ణమూర్తిని చూసేసరికినవ్వులాగిపోయాయి- "గుడ్ ఈవెనింగ్ డాడీ" గ్రీట్ చేశారిద్దరు.

"గుడ్ ఈవెనింగ్! ఏమిటా పని?" సీరియస్‌గా అడిగాడు కృష్ణమూర్తి.

"సారీ డాడీ!" పుస్తకాలసంచులుమూల నుండి తీసుకొచ్చి సరిగా సర్ది డైనింగ్ రూమ్‌లోకి వెళ్ళారిద్దరు.

* * *

తలమీద మచ్చ ఆకుపచ్చగ- సన్నటి ఎర్రటిముక్కు, మిలమిల మెరిసే దేహం హాయిగ, ఆనందంగ, ఎగురుతు గెంతుతు చిన్నగ పలుకుతు, గింజలు కొరుకుతు.

దేహంలో లాలిత్యం——

ఎగరడంలో సౌలభ్యం——

మసుగడలో మాధుర్యం——

ఎలా ఆడుకునేది- ఏ బంధాలు లేకుండ ఎంత స్వేచ్ఛగ ఎగిరేదా పిట్ట.

* * *

కమలకు మధ్యాహ్నాలెంత త్వరగ గడిచిపోయేవి. దాన్ని మచ్చిక చేసుకోవడం కోసం ఎంత కష్టపడింది. దానిలో భయాన్ని పోగొట్టి, అనుమానాల్ని తొలగించి, చేరువ చేసుకోవడం కోసం ఎంత ప్రయత్నించింది.

ప్రతి రోజు రెక్కలు కొట్టుకుంటు, ముక్కుతో కొరుకుతు, పైనవాలి, ముద్దు పలుకులతో పరామర్శిసుంటే ఎంత ఆనందంగ గడిచిపోయేవి క్షణాలు-

ఇప్పుడు——

కాలం మళ్ళీ స్తంభించింది. ఇప్పుడది రావడంలేదు, కమలే వెళ్ళగొట్టింది. అలవాటు చేసుకోవడానికి ఎంత కష్టపడిందో, వెళ్ళగొట్టడానికి అంతకన్న ఎక్కువే కష్టపడింది.

ఒక ఆదివారం- కృష్ణమూర్తి కంట్లో పడిందది.

"బాగుంది."


## పోస్టల్ కోచింగ్ ద్వారా పాస్ కండి

1979లో 8వ క్లాసు పాస్ అయినవారు 1981లో ఇంటరుకు అర్హులు. 1976లో ఎస్. ఎస్. సి. లేక 1977లో ఇంటర్. పాస్ అయినవారు బి. ఏ; బి. కాం (ఫైనల్)కు, నవంబరు 1980 బి. ఎ; బి. కాం. వారు ఎం. ఎ; యం. కాం. (ఫైనల్)కు అర్హులు, ప్రాస్పెక్టసుకు రు. 5/-లు చెల్లించండి

USHAEVENING COLLEGE(Regd)
1-7-378, Bakaram Road, Musheerabad. Hyderabad-48, H. O.
T. Nagar, Madras-17


"ఏమిటి?"

"పిట్ట చాలబాగుంది. ఇంకాబాగామచ్చిక చెయ్యి."

"ఎందుకు?—"

"చాల అందంగ ఉంది. ఇంట్లో పెడదాం."

"ఇంట్లోనా, ఎలా వుంటుంది?"

"పంజరంలో పెడదాం."

"పంజరంలోనా!" — దాని స్వేచ్ఛకున్న రెక్కలు విరవాలా అనుకుంది కమల.

"పంజరంలో పెట్టొచ్చు. కాని, న్యూసెన్సుగ అరుస్తుంది. గింజలు, నీళ్ల ఇస్తుండాలి. అజాగ్రత్తగ వుంటే ఎగిరిపోవచ్చు."

కమల మాట్లాడలేదు.

"ఐడియా - రాజారావని నా ఫ్రెండ్. మనూరికి ట్రాన్స్‌ఫరైంది. జువాలజీ లెక్చరర్. మంచి టాక్సీడెర్మిస్ట్‌కూడా"-

"అంటే——"

"అంటే అదొక కళ. ఇప్పుడీ పిట్ట ఉందనుకో, దాన్నిముందుచంపాలి, తర్వాత ప్రేగులు లాగెయ్యాలి, లోపల గడ్డి కుక్కాలి. తర్వాత పైన ఏదో కెమికల్స్ పూస్తారు. గాజుకళ్ళు పెడ్తారు. బోర్డ్‌మీద మౌంట్‌చేస్తారు. చాల అందంగఉంటుంది. డ్రాయింగ్‌రూమ్‌లో పెట్టొచ్చు. చాల జీవం వుట్టిపడేలా ఉంటుంది."

భయంతో కమల హృదయం ముడుచుకుపోయింది.

చాల తంటాలుపడిదాన్ని వెళ్ళగొట్టింది.

కాని, స్వేచ్ఛగా రెక్కలు విప్పి ఆడే దాని అందమైన హొయలు కమల మనసులో మరువలేదు.

* * *

"ఏమి చేస్తున్నావ్?"

"ఏం లేదు డాడీ" గొంతు వణకుతుంది.

"రాణి వాళ్ళ ఇంటికి వెళ్తున్నావా?"

"లేదు."

"సైన్సుపాఠాలు చదివావా?"

"ఆ!"

"నేనుచెప్పినవిషయాలుగుర్తున్నాయా? మాట్లాడు, మాట్లాడు. నువ్వేం కావాలనుకుంటున్నావ్."

"డాక్టర్" చిన్నగ పలికింది.

వాసంతి కళ్ళల్లో నీటిపొర కమల హృదయాన్ని కదిలిస్తుంది.

"గుడ్! నీ మనసు మరొకవైపు పోకూడదు. పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకు. నౌ యు కెన్ గో."

"వాసంతి ఏం చేస్తుందో చూశావా?"

కమల మాట్లాడలేదు.

"నీకేం చెప్పాను. దాన్ని రాణివాళ్ళ ఇంటికి వెళ్ళనివ్వొద్దన్నాను గుర్తుందా?"

రాణి నాట్యం నేర్చుకుంటుంది. వాసంతికి కూడా నేర్చుకోవాలని అభిలాష. తల్లి దండ్రులు ఎంత వద్దన్నా రాణి దగ్గరకు వెళ్ళి కూర్చుంటుంది.

కమల పుస్తకం చదువుకుంటున్నది.

డ్రెస్సింగ్ టేబిల్‌ముందు నిలబడ్డ వాసంతి చేతులు త్రిప్పుతుంది. ముద్రలు పడుతుంది. ముద్దు ముఖంతో అభినయిస్తుంది. పుస్తకం క్రిందపెట్టి వాసంతి ముద్దు ముఖం చూస్తూ కూర్చుంది కమల.

హఠాత్తుగ వాసంతి ముఖంలో రంగు వెలిసిపోయింది. చిన్నారి చేతులు స్తంభించిపోయాయి.

కాళ్ళల్లో చిన్నగ వణుకు కళ్ళల్లో భయం.

కమల వెనుదిరిగి చూసింది.

అప్పుడేవచ్చిన కృష్ణమూర్తి ముఖంలో క్రోధం.

ఒక ధ్యేయం పిల్లల్లో ఏర్పరచి, క్రమశిక్షణతో పెంచాలని కృష్ణమూర్తి అభిప్రాయం.

వాసు ఇంజనీర్ కావాలి, వాసంతి డాక్టర్ కావాలి.

హల్లో డాక్టర్, హల్లో ఇంజనీర్ అని వాళ్ళను పలుకరిస్తాడు.

వాసు లెక్కల్లో మొద్దు. కృష్ణమూర్తి దగ్గర కూర్చుని సాధిస్తాడు. ప్రతిరోజు దెబ్బలు.

క్రమంగ వాడికి పుస్తకాలంటేనే భయం పుట్టే స్థితి వచ్చింది.

ఆ రోజు లెక్కలు చేయిస్తున్నాడు కృష్ణమూర్తి.

ఇంతలో యెవరో పిలిస్తే బైటకు వెళ్ళాడు.

వాసు గాలి పీల్చుకున్నాడు హాయిగ.

"లెక్కలుచేయి, లేకపోతే దెబ్బలు తగులుతాయి" హెచ్చరించింది కమల.

తలవంచుకుని వాసు వ్రాస్తున్నాడు.

"ఏమిటిది?"

గర్జించాడు కృష్ణమూర్తి. అప్పుడేవచ్చి పుస్తకం చూసి. వాసు చక్కగ బొమ్మ వేస్తున్నాడు- రథం బొమ్మ, పెద్ద పెద్ద చక్రాలు, చాల అంతస్తులు, గోపురాలు, పొడుగాటి త్రాడు లాగడానికి.

"నిన్ను చెయ్యమన్న పనేమిటి- నువ్వు చేసేదేమిటి- యూ స్కౌండ్రల్" పుస్తకం తునకలైపోయింది.

కృష్ణమూర్తి బెల్ట్ తీసుకున్నాడు. వాసు వీపు బ్రద్దలైంది. ఐనా పైకి పెద్దగ ఏడ్వకూడదు.

"కూర్చో. వాటీజ్ యువర్ ఎయిమ్ ఏమిటి? ఏం కాదల్చుకున్నావ్ నువ్వు?"

"ఇంజనీర్" వెక్కిళ్ళమధ్య చెప్పాడు వాసు.

"గుడ్. మర్చిపోకూడదు. మార్గం తప్పకూడదు."

రాత్రి వాసుకు జ్వరం. వారం రోజుల దాక తగ్గలేదు. దాని తర్వాత బుద్ధిగా లెక్కలు చేస్తున్నాడు.

* * *

కమల పుట్టిన రోజు.

కృష్ణమూర్తి బజారుకు తీసుకెళ్ళాడు. చీర, జాకెట్ కొన్నాడు- గులాబీ రంగు. కమలకు తెల్లచీర యిష్టం. తలనిండా మల్లె పూలు యిష్టం.

నన్‌లాగ తెల్లచీరలేం బావుంటాయని కృష్ణమూర్తి అభిప్రాయం.

సాయంత్రం పిల్లల్ని యింటివద్దే వదిలివేసి కమలను సినిమాకు తీసుకెళ్ళాడు.

పిల్లలతోను, కృష్ణమూర్తితోను గుడికి వెళ్ళి అభిషేకం చేయించాలని కమల వుద్దేశం.

తర్వాత కమలను హోటల్‌కు తీసుకెళ్ళి ఏ.సి. రూమ్‌లో ఖరీదైన డిన్నర్ ఇచ్చాడు. పలురకాల వంటకాలుచేసి పిల్లలకు, భర్తకు తృప్తిగపెట్టి ఆనందించాలనికమలకోరిక.

గదికి చేరిన వెంటనే కమలను ఆక్రమించాడు.

ఒంటరిగ పడుకుని గతించిన అనుభవాలను తర్కించుకుంటు, రాబోయే దినాలకై కలలు కనాలని కమల ఊహ.

అలసటతో దేహం మూల్గుతున్నా కృష్ణమూర్తికి చోటిచ్చింది.

తనకు నిరసంగా వున్నా తను వద్దన కూడదు. కృష్ణమూర్తికి కోపం వస్తుంది. ఆ కొద్ది క్షణాలు పళ్ళు బిగబట్టి కళ్ళు మూసుకోవడం అలవాటైంది. పైన ఫ్యాన్ తిరుగుతూంది. కిటికీ రెక్కలు వేసి వున్నాయి. వెచ్చగా వుంది గదిలో. ప్రక్కనే కృష్ణమూర్తి గురక పెడ్తున్నాడు కమలకు నిద్ర రావడంలేదు. తీగలు తెగిన వీణ. వాసు చిరిగిన పుస్తకం. స్తంభించిన వాసంతి చిన్నారి చేతులు — పదే పదే జ్ఞాపకం వస్తున్నాయి. "ముందు చంపాలి- గాయం లేకుండ. తర్వాత పేగులుతోడాలి, గడ్డి కూరాలి, కెమికల్స్ పూయాలి, గాజుకళ్ళు పెట్టాలి, ఎంత జీవవంతంగ వుంటుందని!"

ఔను - ఏమంటారతన్ని?

గుర్తు రావడంలేదు.

కారు - కాదు-టాక్సీ.

ఔను అదే టాక్సీ.... టాక్సీ డెర్మిస్ట్!

ఎందుకో ఆ పదం పదేపదే కమల మనసులో మెదులుతూంది. ✶

ఆకర్షణీయమైనడిజైన్లు, అందమైన చాయలు నిత్య నూతనమైన సరిక్రొత్త ఉత్పత్తులు. బోంబే డైయింగ్‌వారి సుల్‌జోన్ టూ-వే చెక్సు రైజు × చెక్సు రైజు సూటింగ్స్, షర్టింగ్స్, శారీస్, డ్రెస్ మెటీరియల్స్ సరిక్రొత్త స్టాకు వచ్చినది, దయచేయండి.

KANTA CHAP

బోంబే డయింగ్ షోరూం

శ్రీ లక్ష్మి, కొత్తగూడెం.

ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోన్ : 395126

SUPREME CORPORATION (BANKERS)
F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory,
Tardeo Road, BOMBAY-400 034.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో

శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కృప పొందిన

"యోగి యాదవ్"

ఆర్యా!

మీ నిత్య జీవితంలో తీరని సమస్యలను తమయొక్క యోగశక్తితో జయింపచేసి మిమ్మలను ఆశ్చర్యచకితులనుగా చేస్తారు.

అనేక ఉన్నత అధికారులు, అభిమానులు "యోగి యాదవ్" విశేష యోగ కృపచే కష్టములనుండి విముక్తులయినారు.

మీ మనస్సును క్లేశపరచు సమస్యలలో ఒక్క ప్రశ్నను వివరంగా వ్రాసి 'మీ' యింటి విలాసము 90 పైసల తపాలా బిళ్ళలతో ఈ క్రింది విలాసమునకు పంపిన యెడల మీ సమస్యలు తీరు విధమును "యోగి యాదవ్" వివరముగా తెలియజేస్తారు. "యోగి యాదవ్" గారికి పెద్ద పెద్ద అధికారులు పంపిన 'సర్టిఫికెట్లు' (Certificates) యొక్క కాపీ మీకుపంపబడును.

విలాసము : "యోగి యాదవ్"

57, పళనియప్ప నగర్, మద్రాసు-600 087.

N.B. : మీ ప్రశ్నను ఆంగ్లములో మాత్రమే వివరంగా వ్రాసి పంపవలయును.

JAI ADS